క్లుప్తంగా

డిపోలో సౌకర్యాలు కల్పించాలి



బోధన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని డిపో ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే షకీల్ గృహంలో ఆయనను కలిసి, వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కార్మిక నేతలు తెలిపారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్‌లో శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: పట్టణంలోని ఎన్డీఎస్ఎల్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 14వ రోజు కొనసాగాయి. దీక్షలకు బీవీఎస్ (భారతీయ విద్యార్థి సేన) పట్టణ అధ్యక్షుడు లింగం మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులతో పాటు బీవీఎస్ నాయకులు, విద్యార్థులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. నాయకులు లోకేష్‌గౌడ్, రమేష్, ప్రవీణ్, యోగేష్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



నవీపేట: ఈ నెల 16నుంచి ప్రారంభమైన కుష్టువ్యాధి నిర్ధారణ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీలత సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ ఆఫీసర్ సాగ్రమాట్, సూపర్‌వైజర్లు కిషన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులకు నిధులు మంజూరు



వేల్పూర్: మండలంలోని సాహెబ్‌పేట్ గ్రామం నుంచి ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి రూ. 3.77కోట్లు మంజూరు చేసినట్లు సర్పంచ్ కైరి సుధాకర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్రపటానికి గ్రామంలో క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు రేగుల్లరాములు, జెడ్పీటీసీ రాకేశ్‌చంద్ర, ఉపసర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి అండగా ఉంటాం



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం చేపట్టిన పోరాటానికి అండగా ఉంటామని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్నారు. వీరి సమ్మెకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు బాబురావు, మీర్ మాజీద్, జిమ్మిరవి, పోశెట్టి, రవి, బాలకిషన్ పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి సర్దార్ పాపన్న

- గౌడ సంఘాల నాయకులు
- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



బోధన్‌లో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



మోర్తాడ్‌లో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, గౌడ సంఘ నాయకులు

పెర్కిట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/ఎడపల్లి/నవీపేట/మోర్తాడ్/బోధన్/నందిపేట/కమ్మర్‌పల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్ని గౌడ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శుక్రవారం పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గాల్లోని ఆయా మండలాలు, గ్రామాల్లో గౌడ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. రజాకార్లు, పెత్తందారుల దాష్టీకాన్ని అణిచి వేయడానికి 300 సంవత్సరాల క్రితమే విప్లవ పోరాటం అంటే ఏంటో పాపన్న గౌడ్ ప్రజలకు చూపించారన్నారు. పది మందితో సైన్యాన్ని స్థాపించి మూడు వేల మందితో సైనిక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని రజకార్లను గడగడలాడించిన యోధుడన్నారు. ప్రభుత్వం సర్దార్ పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం గౌడ్‌లకు ఆనందాన్ని కల్గించిందన్నారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో సర్దార్ పాపన్న చరిత్రను పొందుపర్చాలని డిమాండ్ చేశారు. అలాగే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంగళ్‌పాడ్ గ్రామంలో..



దేగాం గ్రామంలో..



చౌట్‌పల్లిలో..



మాక్లూర్‌లో..



ఆర్మూర్ పట్టణంలో..



కోటగిరిలో..



నందిపేటలో..

ఈవ్‌టీజింగ్‌పై సమాచారం ఇవ్వాలి



పెర్కిట్(ఆర్మూర్): ఎవరైనా మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడితే వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని షీటీం కానిస్టేబుల్ విగ్నేష్ అన్నారు. పెర్కిట్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్‌కోడ్ ద్వారా షీటీంకి ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించారు. షీటీం కరపత్రాలను అందజేశారు.

గల్ఫ్ ఏజెంట్‌పై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: విదేశాలకు పంపిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసగించిన ఏజెంట్‌పై పలువురు బాధితులు శుక్రవారం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన భోజరాం అనే వ్యక్తి ఆర్మూర్‌తో పాటు జగిత్యాల, కరీంనగర్, నిర్మల్‌కు చెందిన సుమారు 82మంది వద్ద విదేశాలకు పంపుతాని చెప్పి, డబ్బులు తీసుకున్నారని బాధితులు పేర్కొన్నారు. కాగ ఏజెంట్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

కొత్త పంచాయతీరాజ్ చట్టంతో పల్లెల అభివృద్ధి



కార్యదర్శులకు ఉత్తర్వులను అందిస్తున్న మంత్రి

మోర్తాడ్: పల్లెల్లో యాభై సంవత్సరాలలో జరగని అభివృద్ధి కొత్త పంచాయతీరాజ్ చట్టంతో సాధ్యమైందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మోర్తాడ్‌లోని రైతు వేదికలో శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలోని 60 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఆయన రెగ్యులరైజ్ ఉత్తర్వులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీకి ఒక జూనియర్ పంచాయతీ కార్యదర్శిని నియమించి పాలనను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసిందన్నారు. పల్లెలు అభివృద్ధి మార్గంలో పయనిస్తున్నాయని నీతి అయోగ్ కమిటీ వెల్లడించడం సీఎం కేసీఆర్ దక్షతకు నిదర్శనం అన్నారు. డీపీవో డాక్టర్ జయసుధ, ఆర్‌డీవో వినోద్‌కుమార్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు



బోధన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్: ఎమ్మెల్సీ కవిత ఎదుగుదలను ఓర్వలేక ఢిల్లీ లిక్కర్ స్కామంటూ నిత్యం బీజేపీ నాయకులు ఆమెపై నిరాధార ఆరోపణలకు పాల్పడుతున్నారని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. ఢిల్లీలో మాజీ ఎంపీ సయ్యద్ జఫర్, ఎంపీ అర్వింద్‌లు ఈ ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. పట్టణంలోని తన గృహంలో శుక్రవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ముస్లింలపై అత్యధికంగా దౌర్జన్యాలు, మత ఘర్షణలు జరిగాయన్నారు. తెలంగాణలో ముస్లింల సంక్షేమం, భద్రతకు సీఎం కేసీఆర్ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌లా అండగా నిలిచారన్నారు. ముస్లింల సంక్షేమానికి వెచ్చించిన నిధులపై చర్చకు తాను సిద్ధమని విపక్ష పార్టీలకు సవాలు చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఎంపీ అర్వింద్ తన నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ప్రజలు కరోనా విపత్కర పరిస్థితిలో చావు బతుకుల్లో ఉంటే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ నెల 24నుంచి నియోజకవర్గంలో గడప గడపకు బీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, రవీంద్రయాదవ్, నర్సయ్య ఉన్నారు.

సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ఆర్మూర్‌లో అంబేడ్కర్‌చౌరస్తా వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్/బోధన్: సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని, వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బాల్కొండలో తహసీల్దార్ శ్రీధర్‌కు శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజాశేఖర్‌రెడ్డి, నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే ఆర్మూర్‌లో బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. బోధన్లో సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్మూరి శ్రీనివాస్, పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్,నాయకులు బాల్‌రాజ్, శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్, నర్సయ్య, వంశీ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత



నవీపేటలో సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నవీపేట: రైతుల ఆర్థికాభివృద్ధికి నాబార్డు చేయూత నిస్తుందని నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సొసైటీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుల భాగస్వామ్యంతో నడిచే సొసైటీలలో మధ్యవర్తి ప్రమేయం లేకుండా విత్తనాలు, ఎరువులు, రసాయనాలను సొంతంగా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. నాబ్కాన్స్ కో ఆర్డినేటర్లు, సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

బోధన్‌టౌన్(బోధన్): మున్సిపాలిటీలో పారిశుధ్య, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాధర్, శంకర్‌గౌడ్ , బాలరాజు, శివలింగం, విజయ్, శేఖర్, లక్ష్మీ, లక్ష్మణ్, మంజు, సాయి లు తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రిపై విమర్శలు సరికావు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి, అభివృద్ధి చేసిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని ఎమ్మెల్యేషకీల్ విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారీ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి రాబోవు రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, మాజీ మంత్రిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు నాగేశ్వర్‌రావు, గణపతిరెడ్డి, గౌసొద్దీన్, దాము, విఠల్‌రెడ్డి, సంజురెడ్డి, వహీద్, నవీన్, సాయి, మున్నా, రిజ్వాన్, జహీర్, ముస్తాక్ ఉన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

రుద్రూర్: మోస్రా మండల తహసీల్దార్‌గా శ్రీకాంత్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా శ్రీకాంత్ విధులను నిర్వర్తిస్తుండగా, బదిలీపై మోస్రా వచ్చారు.

వేల్పూర్: వేల్పూర్ మండల తహసీల్దార్‌గా మేకల రమేశ్ నియమితులయ్యారు. ఆదిలాబాద్ నుంచి ఆయన పదోన్నతిపై వచ్చి, శుక్రవారం విధుల్లో చేరారు.

సమాచారం..

- ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రిరోడ్డులో గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో మిగిలి ఉన్న సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా శనివారం నుంచి భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ దుర్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు విద్యార్థులు శనివారం నుంచి 21లోగా నేరుగా జాయిన్ కావచ్చని తెలిపారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువ పత్రాలతో స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9704550259ను సంప్రదించాలన్నారు.

పంటల సస్యరక్షణకు జాగ్రత్తలు పాటించాలి



కొప్పర్గలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బోధన్: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి, సోయాబీన్ పంటల సస్యరక్షణకు జాగ్రత్తలు పాటించాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులకు సూచించారు. మండలంలోని కొప్పర్గలో శుక్రవారం వారు పత్తిపంటను, సాలూర మండలం తగ్గెల్లి గ్రామంలో సోయాబీన్ పంటను పరిశీలించారు. పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను అన్నదాతలకు వివరించారు. శాస్త్రవేత్తలు విజయ్, సురేష్, ఏఈవో ముజామీల్ ఉన్నారు.



లక్ష్మాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కలుపు మొక్కల నివారణపై అవగాహన

రుద్రూర్: చందూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామంలో వయ్యారిభామ (పార్థినియం) కలుపు మొక్కల నివారణపై శుక్రవారం రుద్రూర్ కృషివిజ్ఞాన కేంద్రం, జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. కలుపు మొక్క వల్ల కలిగే నష్టాలు ,వాటి నివారణ చర్యల గూర్చి వివరించారు. సర్పంచ్ బొడ్డోల్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ధర్నా నిర్వహిస్తున్న గీత కార్మికులు

రుద్రూర్: తమ సమస్యలు పరిష్కరించాలని గీత కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కోటగిరిలో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికులకు వృత్తి పరికరాలు ఇవ్వాలని, రూ. లక్ష రూపాయల రుణాన్ని ఇవ్వాలని, కల్లు గీత ఆర్థిక కార్పొరేషన్‌కు రూ.21 వేల కోట్లు నిధులు కేటాయించి ఈత, తాటి, ఖర్జూర వనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేనట్లయితే దశలవారికి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు శ్రీధర్ గౌడ్, పండరి గౌడ్, సాయగౌడ్, సురేష్ గౌడ్, యాదగిరి గౌడ్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

- మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా బెంజర్ గంగారాం



బోధన్‌టౌన్(బోధన్): 18వ వార్డు కౌన్సిలర్ బెంజర్ గంగారాంను బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఎమ్మెల్యే షకీల్ నియమించారు. నియమక పత్రాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు రవిందర్ యాదవ్, కౌన్సిలర్‌లతో కలిసి కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు శుక్రవారం అందించారు.

- బీఆర్ఎస్ బూత్ కమిటీలు



మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లి, వేణుకిషాన్‌నగర్ తండా, సింగంపల్లి తండాలలో శుక్రవారం బీఆర్ఎస్ మండల బూత్ కమిటీల ఇన్‌చార్జిలు బూరోళ్ల అశోక్, చింత మల్లారెడ్డి, అశోక్, తొగరి భూషన్ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి నియామకపు పత్రాలను అందించారు. సర్పంచ్‌లు కట్కం వెంకన్న, రమేష్‌నాయక్, రాథోడ్ గంగాధర్, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లికి కళాశాల మంజూరు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలానికి జూనియర్ కాలేజ్ మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 180 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల మంజూరుకు కృషి చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కమ్మర్‌పల్లి గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించి, సీఎం కేసీఆర్, మంత్రి వేముల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సినిమాలు	తెలుగు/హిందీ/ఇంగ్లీష్
పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)	
స్క్రీన్-1 -	బ్లూ బీటెల్-10.10 7.20
	పిజ్జా-3 ది మమ్మీ (తెలుగు) -1.00
	భోళా శంకర్ -4.00
	గదర్-2 (హిందీ) -10.10
స్క్రీన్-2 -	జైలర్ (తెలుగు) -11.45, 3.10, 6.53, 10.00
స్క్రీన్-3 -	డీడీ రిటర్న్స్ (తెలుగు) -11.50
	గదర్-2 (హిందీ) -2.35
	జిలేబీ (తెలుగు) - 6.10
	యోగి (తెలుగు) - 9.10
స్క్రీన్-4 -	గాంధీ (తెలుగు) - 10.00
	రఘువరన్ బీటెక్ - 1.20
	ప్రేమ్ కుమార్ (తెలుగు) -4.10
	మిస్టర్ (తెలుగు) - 7.20
	డీడీ రిటర్న్స్ (తెలుగు) -10.20

సంక్షిప్తం

సీఎంను కలిసిన డాక్టర్ మధుశేఖర్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, వైద్యుడు మధుశేఖర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ చైర్మన్‌గా నియమితులైయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పదవి ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు దంత వైద్యుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో వైద్యులు దంత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం తగు సూచనలు, సలహాలు చేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(బి) తండాకు చెందిన కాట్రోత్ తుక్యా ఇటీవల కరెంట్‌షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో శుక్రవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే షకీల్ రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించగా, తన క్యాంప్ ఆఫీసులో బీఆర్ఎస్ నాయకులు నగదును అందజేశారు.

ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు సన్మానం



బాల్కొండ: మండల కేంద్రం మీదుగా నిర్మల్ వెళ్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును శుక్రవారం బాల్కొండలో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అలగే ముప్కాల్‌లో ఎంపీటీసీ పద్మను ఆమె నివాసంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. నాయకులు నవీన్, శ్రీనివాస్, నర్సయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో పలు బాధిత కుటుంబాలకు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ నల్ల రమేశ్, ఎంపీటీసీలు గుడాల గంగాధర్, నోముల గంగారెడ్డి, నాయకులు గంగారెడ్డి, భూమన్న, రవి పాల్గొన్నారు.

సీసీరోడ్డు కబ్జాకు యత్నం

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలోగల బీసీ కాలనీలో గ్రామానికి చెందిన అడువల రఘుమారాజ్, అడువల చిన్న హన్మాండ్లు ట్రాక్టర్ల ద్వారా మట్టిని సీసీరోడ్డుకు అడ్డంగా పోస్తూ కబ్జాకు యత్నించినట్లు సర్పంచ్ వంశీకృష్ణ చెప్పారు. వారిపై చర్య తీసుకోవాలని తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీవో, డీపీవోకు ఫిర్యాదు చేశామన్నారు. మట్టిని పోసిన ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామస్తులు శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. తలారి జాన్, వసంత్‌రావు, బొంబాయి గంగాధర్, గైని గంగాధర్, గడ్డం రంజిత్, మీసాల్ రాహుల్, వినోద్, మురళి తదితరులు పాల్గొన్నారు.